ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై కమిటీ ఏర్పాటు!




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

అర్చకులకు బకాయి వేతనాలు విడుదల హర్షం...




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 29 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 29 జనవరి 2025



- ఎక్స్‌పీరియం పార్క్‌ను ప్రారంభించిన రేవంత్ రెడ్డి
- 150 ఎకరాల్లో సుమారు 25వేల జాతులకు చెందిన మొక్కలు
- హాజరైన మెగాస్టార్ చిరంజీవి

## టెంపుల్, ఎకో టూరిజంను
# అభివృద్ధి చేస్తాం

**హైదరాబాద్,చిలుకూరు,28(పిసిడబ్ల్యూ న్యూస్):** శంకర్‌పల్లి మండలం, ప్రొద్దుటూరులో ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రెండ్లీ పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు నేతలు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ప్రకృతి ప్రేమికుల కోసం నగర శివార్లలో నిర్మించిన అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ 'ఎక్స్ పీరియం' పార్క్‌ను ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో రామ్‌దేవ్‌రావు 150 ఎకరాలలో ఏర్పాటు చేసిన పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. దీని కోసం సుమారు

వివరాలు 2లో

## ఫిబ్రవరిలో అమెరికాకు ప్రధాని మోదీ.. వెల్లడించిన ట్రంప్




## అలెరియా ఏఐతో పన్నుల రాబడి పెరుగుదల: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వసూలు, ఇతర రాబడి మార్గాల్లో ఆదాయం నష్టపోకుండా చూసే 'అలెరియా ఏఐ' టెక్నాలజీ పనితీరు ఆసక్తి కరంగా ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం

వివరాలు 2లో

## నేడు ఇస్రో 'సెంచరీ' ప్రయోగం




## అవినీతి రహిత పాలన
# పేరుతో బురిడీ

- కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం
- ఎన్నికల ప్రచారంలో విరుచుకుపడ్డ రాహుల్



**న్యూఢిల్లీ,28(పిసిడబ్ల్యూ న్యూస్):**అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీలోని ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అధికారంలోని ఆమ్ ఆద్మీ పార్టీపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ కొట్టించారని, కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం ఉంటున్నారని, ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ విరుచుకుపడ్డారు. రాహుల్'కేజ్రీవాల్ తనకు తోచిన విషయాన్ని మాట్లాడుతూ ఉంటారు. మొదట్లో దిల్లీలో అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పారు. దేశ రాజధానిలో మార్పులు చూపిస్తానని అన్నారు. కానీ, పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం కనిపించకుండా పోతారు. దిల్లీలో హింస జరిగే సమయంలో మాయం అయ్యారు. ఆయనకు కొత్తలో చిన్న కారు మాత్రమే ఉండేది. కానీ, తర్వాత శీష్ మహల్‌లో (అద్దాల మేడ) నివసించారు' అంటూ దిల్లీలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్

వివరాలు 2లో



## సీఎం రేవంత్‌రెడ్డికి పాలన
# చాతనైతలేదు

- అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- నల్లగొండ రైతు ధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్

**నల్గొండ,28(పిసిడబ్ల్యూ న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చాతకావడం లేదని, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో అన్ని విధాలుగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నల్లగొండ జిల్లాలో రైతు ధర్నాలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పాలకులపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులు గొడ్డు కారంతో అన్నం తినాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఐటీ టవర్ కళ తప్పిందని విమర్శించారు.

వివరాలు 2లో

## థియేటర్లకు
# హైకోర్టు షాక్

- 16 ఏళ్ల లోపు పిల్లలకు టైమింగ్స్
- ఉదయం 11 తరవాత..రాత్రి 11 లోపు మాత్రమే అనుమతి







## అమీన్‌పూర్‌లో రంగంలోకి
# బుల్డోజర్లు

- ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

## బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : ఆర్.కృష్ణయ్య

# టెంపుల్, ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రూ. 150 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కో శిల్పానికి రూ. 5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. 1,500 మంది కూర్చునేలా ఇండియాలోనే అతిపెద్ద హంపీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. 30 అడుగుల ఎత్తులో 20 స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పాలు ఏర్పాటు చేసి వాటిని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. 50 కోట్లతో 12 ఎకరాలలో మ్యాన్‌మేడ్ బీచ్ ఏర్పా టు చేశారు. 40 గదులు, 20 కాటేజీలతో సుందరమైన సహజ రిసార్టు ద్వీపంగా తీర్చిదిద్దారు. ప్రీవెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్, ఫొటో షూట్‌లకు ఎక్స్‌పీరియంను రామ్‌దేవ్‌రావు ఎంతో శ్రమకోర్చి ఏర్పాటు చేశారు. దేశానికి గర్వకారణంగా, రాష్ట్ర ప్రతిష్టకు చిహ్నంగా ,హైదరాబాద్‌కుఐకానిక్‌గా ఎక్స్‌పీరియం ఉంటుందన్నారు.

# అవినీతి రహిత పాలన పేరుతో బురిడీ

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ విరుచుకుపడ్డారు. 'అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పి.. దిల్లీలో భారీ కుంభకోణమే చేశారు. కుంభకోణానికి కేజ్రీవాల్ రూపకల్పన చేశారు. కాబట్టి వాస్తవం బయటకి వచ్చింది. ఆప్ నేత మనీశ్ సిసోదియా జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం తమ పదవుల నుంచి తప్పుకున్నారు. పదవిలో ఉన్నప్పుడు ఆయన నివసించిన శీష్ మహల్‌ను మీరూ చూశారు. కేజ్రీవాల్ అత్యంత విలాసవంతమైన అద్దాల మేడలో నివాసం ఉన్నారు. ఇప్పుడు నిజాలు బయటపడ్డాయి. వారి రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి' అని అన్నారు. దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అధికారంలోని ఆప్‌ను గద్దె దింపేందుకు ప్రతిపక్షాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొంతకాలంగా 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ భాజపా విమర్శిస్తోంది. ఈ క్రమంలోనే శీష్ మహల్ గురించి ప్రస్తావిస్తూ రాహుల్ ఆప్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. దిల్లీలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# అలెరియా ఏఐతో పన్నుల రాబడి పెరుగుదల: మంత్రి శ్రీధర్ బాబు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలోని తన కార్యాలయంలో ఇచ్చిన ప్రెజెంటేషన్ ను ఆయన తిలకించారు. ఆఫ్ లైన్ లో పనిచేసే ఈ టూల్ ను ప్రభుత్వ విభాగాలకు సంధానిస్తే రాబడిలో నష్టపోతున్న 30 శాతాన్ని తిరిగి పొందవచ్చని సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు. వివిధ పథకాల్లో లబ్దిదారుల ఎంపికలో అర్హులు మాత్రమే ప్రయోజనం పొందేలా అలెరియా ఏఐ సహాయ పడుతుందని వారు వెల్లడించారు. ఫ్రాన్స్, యుఏఇ దేశాల్లో ప్రధాన కార్యాలయాలు ఉన్న ఈ టెక్నాలజీ సంస్థ పరిజ్ఞానాన్ని దేశంలో మార్కెట్ చేసేందుకు ఐబీటీ ఇన్నోవేషన్స్, ఇన్నోలాజిక్ టెక్నాలజీస్ అనుమతి పొందాయి. మంత్రి శ్రీధర్ బాబును కలిసిన వారిలో ఐబీటీ సిఇఓ మన్సూర్ అలీ ఖాన్, అలెరియా సిఇఓ ఎరిక్ లియాండ్రీ, ఇన్నోలాజిక్ సిఇఓ శివ దొండపాటి ఉన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చాతనైతలేదు

(మొదటి పేజీ తరువాయి)

తన రాక సందర్భంగా నల్లగొండ ప్రజల ఆదరణ చూస్తుంటే.. తాను రైతు ధర్నాకు వచ్చినట్లు లేదని, విజయోత్సవ ర్యాలీకి వచ్చినట్లు ఉందని అన్నారు. కేటీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'ఇవాళ నల్లగొండ పట్టణంలో అడుగుపెట్టగానే మహాత్మాగాంధీ యూనివర్సిటీ దగ్గర మూడు, నాలుగు వందల మంది విద్యార్థులు రోడ్డు మీదికి వచ్చిండ్రు. 'అన్నా కేసీఆర్ పాలనలో మాకు అన్ని వసతులు ఉండేవి. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గొడ్డు కారంతో అన్నం తినే దుస్థితి వచ్చింది. ఒకసారి మీరు మా క్యాంపస్‌కు రావాలె' అన్నరు. తప్పకుండా మధ్యాహ్నం రెండున్నర గంటలకు వస్త అని వాళ్లకు చెప్పి వచ్చిన. అక్కడి నుంచి బయలుదేరి ముందుకు రాంగనే కళ తప్పిన ఐటీ టవర్ కనిపించింది. వెంకట్‌రెడ్డి వచ్చినంక అండ్ల ఎవలన్న ఉన్నరో.. లేకుంటే తాగుబోతుల అడ్డా అయిందోగానీ, మొత్తానికైతే ఐటీ టవర్ కళ తప్పింది' అన్నారు. 'అక్కడి నుంచి కొంచెం ముందుకు రాంగనే.. ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఇక్కడి దాకా (రైతు ధర్నా ప్రాంగణం) జనం భారీ సంఖ్యలో కనిపించారు.మళ్లీ భూపాల్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యిండు అనిపించింది. ఒక విజయోత్సవ ఊరేగింపు జరిగినట్లుగా ఉంది. భారీగా ధర్నాకు తరలివచ్చిన నల్లగొండ రైతు బిడ్డలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని కేటీఆర్ చెప్పారు.

# ఫార్ములాను అడ్డుకున్న సిఎం రేవంత్

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఫోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫార్ములా ఈ కేసు వ్యవహారంలో సీఎంపై కేసు నమోదు చేయాలని నార్సింగి పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఆర్ఎస్పి ఫిర్యాదు చేశారు.ఆయన వెంట పలువురు బిఆర్ఎష్ నేతలు ఉన్నారు.ఆయన మాట్లాడుతూ.. నేను రాజకీయాల్లో రాకముందు ఐపీఎస్ అధికారిగా, క్రైమ్ బ్రాంచ్ డీసీపీగా, అడిషనల్ డీజీపీగా, వార్ క్రైమ్స్ ఇన్వెస్టిగేటింగ్ అధికారిగా ఐక్యరాజ్యసమితిలో పనిచేశా. రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల లేని అవినీతిని పేపర్ మీద పెట్టి అనవసరంగా తెలంగాణకు నష్టం చేస్తున్నాడు అని మండిపడ్డారు. కాగా, ఫార్ములా ఈ రేసు కేసులో మాజీ మంత్రి కెటిఆర్.. చట్ట విరుద్ధంగా, ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి దాదాపు రూ.53 కోట్లు ట్రాన్స్ ఫర్ చేసినట్లు గుర్తించిన ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

# నేడు ఇస్రో 'సెంచరీ' ప్రయోగం



**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** స్వదేశీ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ అత్యుత్తమ అంతరిక్ష సంస్థగా ఎదిగిన ఇస్రో చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమైం ది. ఇస్రో భారత అంతరిక్ష చరిత్రలో మరో మైలురాయి ని సాధించడానికి సమయం సమీపించింది. భారత అంతరిక్షపరిశోధన సంస్థ ఇస్రో, తన 100వ ప్రయోగాన్ని బు ధవారం చేపట్టనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు జీఎస్‌ఎల్వీఎఫ్ 15 రాకెట్ ద్వారా ఎన్వీస్02 అనే శాటిలైట్‌ను ఇస్రో అంతరిక్షం లోకి పంపించనుంది. అయితే ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ మంగళవారం తెల్లవారు జామున 2.52 గంటలకు ప్రారంభమైంది. 27 గంటల పాటు కొనసాగనున్న ఈ కౌంట్‌డౌన్ బుధవారం ఉదయం 6.23 గంటలకు ముగిసిన తర్వాత నింగిలోకి ప్రవేశిస్తుంది. ఇస్రో ఛైర్మన్‌గా జనవరి 13న బాధ్యతలు చేపట్టిన వి. నారాయణన్‌కు ఇది మొదటి మిషన్ కానుంది. ఈ జిఎస్ఎల్వీ ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం కోసం ఇప్పటికే దాన్ని షార్ లోని రెండో లాంచ్ ప్యాడ్ వద్దకు తరలించారు.జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఈ జీఎస్‌ఎల్వీఎఫ్ 15 రాకెట్, 17 వది కాగా, దేశీయ క్రయోజెనిక్ కలిగిన 11 వ రాకెట్ కావడం గమనార్హం. ఈ ప్రయోగం ద్వారా ఎల్వీస్ 02 .. ఉపగ్రహాన్ని జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ లోకి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశ పెట్టనున్నారు. ఈ ప్రయోగం ద్వారా నావిగేషన్ వ్యవస్థ, నావిక్ మరింత విస్తృతం కానుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ప్రయోగం కన్నా ముందు చేపట్టిన జిఎస్ఎల్‌విఎఫ్ 12 మిషన్ విజయవంతంగా నేవిగేషన్ శాటిలైట్ ఎన్‌విఎస్01ను మోసుకెళ్ల గలిగింది. దీని తరువాత ఇప్పుడు 50.9 మీటర్ల ఎత్తైన జిఎస్ఎల్‌వి ఎఫ్ 15 శాటిలైట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఇది విజయవంతమైతే దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' మరింత వేగంగా కచ్చితత్వంతో సేవలు అందించనుందని ఇస్రో వర్గాలు చెబుతున్నాయి,. ఇక ఈ ఎన్వీస్ 02 శాటిలైట్‌ను కర్ణాటక రాజధాని బెంగళూరు లోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో రూపొందించగా, దానికి ఇతర శాటిలైట్ సెంటర్లు సహకరించాయి.

# థియేటర్లకు హైకోర్టు షాక్

**● 16 ఏళ్ల లోపు పిల్లలకు టైమింగ్స్ ● ఉదయం 11 తరవాత..రాత్రి 11 లోపు మాత్రమే అనుమతి**

**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** పుష్ప 2' సినిమా ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన అనంతరం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుని ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచుకోవడాలు వంటి వెసులుబాటు ఉండదని స్పష్టంగా ప్రకటించింది. సంక్రాంతికి వచ్చిన 'గేమ్ చేంజర్' సినిమాకు టికెట్ల ధరను పెంచుకునే వెసులుబాటు కల్పించినా.. కోర్టు కలగజేసుకోవడంతో.. వెంటనే టికెట్ల ధరలను తగ్గించారు. దీంతో చిన్న సినిమాలకు ఏమోగానీ.. భారీ బ్జడెట్‌తో రూపొందే సినిమాలకు మాత్రం అంతే భారీగా ఇబ్బంది నెలకొంది. ఇదిలా ఉంటే.. తాజాగా హైకోర్టు.. ఫ్యామిలీ ఆడియన్స్‌కు, థియేటర్ సినిమాలకు మరో భారీ షాక్ ఇచ్చింది. ఇకపై థియేటర్స్‌లో పిల్లలు సినిమా చూడాలంటే నిర్దిష్ట సమయంలో మాత్రమే చూడాలనేలా తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తరువాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమాలకు అనుమతించరాదని థియేటర్లకు హైకోర్టు తెలిపింది. 'గేమ్ ఛేంజర్' మూవీ టిక్కెట్ ధరల పెంపును, అదనపు షోలకు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై విచారణ చేపట్టగా.. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు గత ఉత్తర్వుల మేరకు బెనిఫిట్ షోకు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పునః సమీక్షించి, ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతించరాదని నిర్ణయం తీసుకుంటూ జనవరి 11న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజా ప్రయోజనాలు, ఆరోగ్యం, రక్షణలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదనేలా నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే సినిమాటోగ్రఫీ నిబంధనల ప్రకారం ఉదయం 8.40లోపు, అర్ధరాత్రి 1.30 గంటల తర్వాత సినిమాలకు అనుమతించరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనర్లను అనుమతించరాదని, లేని పక్షంలో అది వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం



చూపుతుందని వివరించారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో చివరి షో అర్ధరాత్రి 1.30 గంటల వరకు నడుస్తుందని, ఇందులో మైనర్ల ప్రవేశానికి ఎలాంటి నియంత్రణలు లేవని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, 'పుష్ప 2' బెనిఫిట్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించారు. ఇప్పుడు కోర్టు ఇచ్చిన ఆదేశాలతో సెకండ్ షోలకు 16 సంవత్సరాల లోపు వారి నిషేధాన్ని అమలు చేయటం వల్ల అది కచ్చితంగా వసూళ్లపై ప్రభావం చూపుతుంది. అసలే ఓటీటీలు వచ్చి.. ప్రేక్షకులను థియేటర్లకు రానివ్వకుండా చేస్తుంటే.. ఇప్పుడీ ఆదేశాలు మరింతగా థియేటర్లపై ప్రభావం చూపే అవకాశం అయితే లేకపోలేదు.

# ఫిబ్రవరిలో అమెరికాకు ప్రధాని మోదీ.. వెల్లడించిన ట్రంప్



**వాషింగ్టన్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫిబ్రవరిలో అమెరికా పర్యటనకు ప్రధాని మోడీ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయన వైట్‌హౌస్‌ను సందర్శించనున్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు రాబోతున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వచ్చే నెలలో మోడీ వైట్‌హౌస్‌లో సందర్శించే అవకాశం ఉందని తెలిపారు. ఇద్దరి నేతలు ఫోన్ కాల్ లో సంభాషించారు. ఈ క్రమంలోనే పీఎం మోడీ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో పర్యటన గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ఫ్లోరిడా నుంచి జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు తిరిగి వస్తుండగా ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. "సోమవారం నేను భారత ప్రధాని మోడీతో చాలాసేపు మాట్లాడాను. అతను వచ్చే నెలలో, బహుశా ఫిబ్రవరిలో వైట్ హౌస్‌కి రాబోతున్నారు. భారత్‌తో మాకు చాలా మంచి సంబంధాలు ఉన్నాయి' అని ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో ట్రంప్ అన్నారు. కాగా, రెండోసారి ట్రంప్ బాధ్యతల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. ప్రెసిడెంట్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఇక, తొలిసారి అమెరికా ప్రెసిడెంట్ అయిన డొనాల్డ్ ట్రంప్.. భారత పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే.

# అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

**● ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు**



**సంగారెడ్డి జిల్లా,28(పిసిడబ్ల్యూ న్యూస్):** హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహారీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు.గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పుర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లును హైడ్రా కూల్చివేసింది. ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై కమిటీ ఏర్పాటు!



**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా విధానంపై సీఎం రేవంత్ ఒక ఉన్నతస్థాయి అధ్యయన కమిటీని నియమించారు. ఈ కమిటీ వారం రోజుల్లోగా తమ అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక అందించాలని ఆదేశించారు.రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ తో ఈ కమిటీని నియమించారు.ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా.. గనుల శాఖపై ముఖ్యమంత్రి సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు.రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారులకు సౌకర్యంగా ఇసుక విధానం ఉండాలన్నారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత రావడం లేదని, అదే సమయంలో వినియోగదారులు ఎక్కువ ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలని.. అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూళ్లు కాకపోవడంపైనా అధికారులను సీఎం ప్రశ్నించారు. మేజర్, మైనర్ ఖనిజ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధ్యయన కమిటీని సీఎం ఆదేశించారు.

# బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీస్, జడ్పీటీసీ లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజ కీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్‌బీ వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ డ్రైవింగ్ చేసి కష్టాల పాలవకుండా బాధ్యతగా ఉండాలి

- రోడ్డు భద్రత నియమాలు పాటించడం మన అందరి బాధ్యత
- రోడ్డు ప్రమాదాల వల్ల నష్టపోతున్న వారిలో ఎక్కువ శాతం యువతే
- ఎస్పీ సుదీర్ రాంనాధ్ కేకన్



**మహబూబాబాద్ జిల్లా, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి నెహ్రూ సెంటర్ మీదిగా అండర్ బ్రిడ్జి, మదర్ తెరెస్సా బొమ్మ, బస్ స్టాండ్ రోడ్డు, నర్సంపేట బైపాస్, వైస్సార్ బొమ్మ, మునిసిపల్ ఆఫస్ నుండి తిరిగి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ జెండా ఊపి ప్రారంభించి బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాల నుంచి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో 60 నుంచి 70 శాతం యువతే ఉన్నారని చెప్పారు. కాబట్టి రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల కుటుంబానికి కలిగే నష్టాన్ని ఎవరు పూడ్చలేరని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. జిల్లాను యాక్సిడెంట్స్ ఫ్రీగా మార్చడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల కాలంలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ డ్రైవింగ్ చేసి కష్టాల పాలవకుండా బాధ్యతగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని, గుర్తు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిరోజు రోడ్డు భద్రతపై కొంత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ డ్రైవింగ్ కారణంగా జీవితాలను నాశనం చేసుకోకుండా, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించి సహాయం చేస్తున్న శ్రీనివాస్ అనే యువకుడిని సన్మానం చేసి హెల్మెట్ ను బహుకరించారు. నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ సరవయ్య, ఎస్బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, బయ్యారం సీఐ రవి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ఇన్స్పెక్టర్ శంకర్,ఇతర అధికారులు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారుల ఇంటి వద్దనే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..

- సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మలిశెట్టి వేణు



**సీరోలు, జనవరి 28(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం కొత్తూరు.(సి) గ్రామానికి చెందిన పేరం శ్రీరాములు.జాటోతు బేబి రాందాస్ నాయక్ లకు ఇంటి వద్దనే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల సీరోలు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మలిశెట్టి వేణు మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మలిశెట్టి వేణు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు పార్టీలకు అతీతంగా పేద వారికి పథకాలు అందేలా ప్రజా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.గత బిఆర్ యస్ ప్రభుత్వం లో బిఆర్ యస్ నాయకులు వారి ఇండ్లలో కూర్చుని వారి అనుచరులకు.బంధువులకు మాత్రమే పథకాలు అందేలా చూసే వారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లో గ్రామ సభలు నిర్వహించి అసలైన లబ్దిదారులను గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు.. ప్రభుత్వ పథకాలు రాని లబ్దిదారులు ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు..ప్రతి పక్ష నాయకుల మాయ మాటలు నమ్మకూడదని గ్రామస్తులను మలిశెట్టి వేణు కోరారు..ఈ కార్యక్రమంలో మండల నాయకులు పగడాల క్రిష్ణా రెడ్డి.ఇందిరమ్మ కమిటీ సభ్యులు కోంపెల్లి పూలమ్మ మల్లయ్య.చిప్పరపల్లి వెంకన్న.సూడి సందీప్ రెడ్డి.గ్రామ ప్రధాన కార్యదర్శి చిట్టూరి లక్ష్మి నారాయణ.వీరిశెట్టి శ్రీను.కొత్త రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొరిపల్లి శ్రీనివాస్‌కు "డాక్టరేట్"

- "వేద సంహిత మెమోరియల్ ట్రస్ట్" ద్వారా చేసిన సేవలకు "న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ" నుండి డాక్టరేట్ ప్రధానం




**ఖమ్మం, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** హైదరాబాద్లోని రవీంద్రభారతిలో సోమవారం సాయంత్రం డాక్టరేట్ ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. "వేద సంహిత మెమోరియల్ ట్రస్ట్" ద్వారా చేసిన సేవలకు గాను గుర్తింపునిచ్చి న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ ఫౌండర్ బిషప్ పాలంగి జోసెఫ్ వారి ద్వారా కొరిపల్లి శ్రీనివాస్ కు డాక్టరేట్ ను ప్రధానం చేసినారు. కొరిపల్లి శ్రీనివాస్ ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, పాతలింగాల గ్రామానికి చెందిన కొరిపల్లి వెంకయ్య, వెంకటమ్మల 13వ సంతానంగా జన్మించారు. చదువుల నిమిత్తం ఖమ్మం వెళ్లి స్థిరపడి, జహీర్ పుర గుట్టలబజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కొరిపల్లి శ్రీనివాస్ కు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు ఒక బాబు. రెండవ సంతానం కూతురు వేద సంహిత ఐదు సంవత్సరాల క్రితం మరణించినారు. ప్రేమగా పెంచుకున్న కూతురు చనిపోవడంతో ఆమె పేరు మీద సహాయం చేయాలని "వేద సంహిత మెమోరియల్ ట్రస్ట్" ఏర్పాటుచేసి ఆ ట్రస్టు ద్వారా చేసిన సేవలకు గాను గుర్తింపునిచ్చి "న్యూలైఫ్ థియలాజికల్ యూనివర్సిటీ" నుండి "యూనివర్సిటీ ఫౌండర్ బిషప్ పాలంగి జోసెఫ్" ద్వారా కొరిపల్లి శ్రీనివాస్ కు డాక్టరేట్ ను ప్రధానం చేసినారు. డాక్టరేట్ ప్రధానం చేసిన బిషప్ పాలంగి జోసెఫ్ వారికి శ్రీనివాస్ దన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... డాక్టరేట్ ప్రధానంతో మరింత సేవలు చేయుటకు బాధ్యతను పెంచిందన్నారు. కొరిపల్లి వెంకయ్య, వెంకటమ్మ, వేద సంహిత (కెవివివి) మెమోరియల్ ట్రస్టు ద్వారా వారి జ్ఞాపకార్థంగా సేవ చేయటం, తద్వారా మంచి గుర్తింపురావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

# కేజీబీవీ నేరడ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ

- అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్





**కురవి, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం రోజున కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా పరిషత్ నేరడ చిన్న గూడూరు, కేజీబీవీ నేరడ పాఠశాలలను ఆకస్మికంగా జీ సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించినారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఉత్తమమైన ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులని,ఉత్తేజపరిచినారువిద్యార్థులు కేవలం పాస్ వరకే కాకుండా ఉన్నతమైనటువంటి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలు వంటగది, ఆహార పదార్థాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించినారు. పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో తీసుకోవలసిన కోర్సుల గురించి కూడా వారికి క్యారియర్ గైడెన్స్ ని అందజేయాలని, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను కోరారు.ప్రభుత్వం వసతి గృహాల్లో అమలు చేస్తున్న మెనో చాట్ ప్రకారం ఖచ్చతంగా పాటించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, మంచి పోషకాహారం అందించాలని, నేరడ గ్రామం కురవి మండలం, చిన్నగూడురు మండల కేంద్రాల్లోని కస్తూరిబా గాంధీ బాలిక వసతి గృహం పరిసరాలను, విద్యార్థీనీలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చిన్నగుడురు మండల కేంద్ర హైస్కూల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు, కచ్చితంగా మెనూ పాటించాలని, పదవతరగతి విద్యార్థుల రోజువారి గ్రాండ్ టెస్టుల ఉత్తీర్ణతను పరిశీలించారు. ఉత్తీర్ణత శాతం ఇంకా పెంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు, పదవ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు,ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పగిడిపల్లి లలిత, స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, ఉపాధ్యాయులు, వసతి గృహ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఐటీ శాఖ మంత్రిని కలిసిన ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు



**తొర్రూర్ ప్రతినిధి,జనవరి 28(పిసి డబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముఖ్యంగా నియోజకవర్గంలో ఐటీ రంగంలో అవకాశాలను పెంపొందించడం, యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడం వంటి అంశాలపై చర్చించారు.

# ఖానాపూర్లో పెన్షన్ దారులు నిరసన

- మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు



**ఖానాపూర్, జనవరి 28,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలం లోని పింఛన్ దారులు ప్రభుత్వం ఇస్తానన్న పింఛన్లు పెంచాలని ప్లకార్డులు చేతభూని నిరసన వ్యక్తం చేసిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ప్రభుత్వ హామీ మేరకు పెంచి ఇస్తానన్న పెన్షన్లు ఇవ్వాలని నినాదాలతో ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేసిన పెన్షన్ దారులు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి మీరు పెంచి ఇస్తానన్న పింఛన్లు పెంచి ముసలోళ్ళను, వితంతువులను, వికలాంగులను ఆదుకోవయ్యా ముఖ్యమంత్రి అంటున్న ఖానాపురం మండల పెన్షన్ దారులు మద్దుతు ప్రకటించిన మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు.అయ్యా ముఖ్యమంత్రి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం పెంచి ఇస్తానన్న పెన్షన్లు పెంచకుండా 13 నెలలుగా మా పెన్షన్ దారులకు బాకీ పడ్డ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖానాపురం మండల కేంద్రంలో పెన్షన్ దారులు నిరసన వ్యక్తం చేసి ప్లకార్డులు చేత భూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ దారులకు మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిరసనకారులతో కలిసి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం హామీలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చాక సబ్బండ వర్గాలను విస్మరిస్తుందని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులను నమ్మబలికి వారి ఓట్లతో గెలిచి 2023 డిసెంబర్ 9 అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంచి ఇస్తానని అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్న కోతలు పెడుతున్నాడే తప్ప. పెన్షన్లు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముసలోళ్ళు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు గోసపడుతున్నారని. వాళ్లకు ప్రభుత్వ హామీ మేరకు పెన్షన్లు వెంటనే పెంచి ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రూ.4000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఇస్తానన్న 6000 రూపాయల పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వాగ్దానం నుండి ఇప్పటివరకు పెన్షన్ దారులకు 26000 వేల రూపాయలు బాకీ పట్టదని వాటిని వెంటనే భేషరతుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో పెరిగిన ధరలకు అనుకూలంగా ప్రభుత్వం పెంచి ఇస్తానన్న పెన్షన్ డబ్బులను వెంటనే విడుదల చేసి పెన్షన్ దారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం సతీష్, గంగాపురం రాజు, వడ్డే రాజశేఖర్, బరిగెల వీరన్న, కదుదూరి ఐలయ్య, పెన్షన్ దారులు పాల్గొన్నారు.





# పారిశుద్ధ్య కార్మికులకు జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీ...

**కరీంనగర్ టౌన్, జనవరి 28(పిసి డబ్ల్యూ న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ 18 వ 19వ డివిజన్ లలో పనిచేయుచున్న 40 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు జ్యూట్ బ్యాగ్ లను పంపిణీ చేయడం జరిగింది. ప్లాస్టిక్ వాడకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలని పెద్దలు సూచించారు. 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణాగౌడ్,19 వ డివిజన్ కార్పొరేటర్ లయన్ ఏదుల్ల రాజశేఖర్, గోల్డెన్ శాతవాహన అధ్యక్షులు లయన్ మానువాడ శంకర్, కార్యదర్శి లయన్ ననువాల గిరిధర్ రావు, కోశాధికారి లయన్ డా. కుంబోజు రమేష్, ఇన్నర్ కాబినెట్ లయన్ గుంటుక చంద్రప్రకాష్, ఆర్.సి లయన్ గాలిపెల్లి వెంకట్, జెడ్.సి లయన్ పవనసుత రాజు, చార్టర్ ప్రెసిడెంట్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ పాశం నర్సింహారెడ్డి, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ చిలుపూరి రాములు, సభ్యులు లయన్ గోనె చంద్రారెడ్డి, లయన్ బండారి గంగాధర్, లయన్ ఆరెపల్లి సంపత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డినీ కలిసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు



**తొర్రూర్ ప్రతినిధి,జనవరి 28(పిసి డబ్ల్యూ న్యూస్):** మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేశారు. విదేశీ పర్యటనలు ముగించుకొని భారీగా పెట్టుబడులతో హైదరాబాద్ విచ్చేసిన శుభ సందర్భంగా ఎమ్మెల్యేలు సీఎం ను కలిశారు. సీఎం ను కలిసిన ఎమ్మెల్యేలలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో పాటు స్టేషన్ ఘనపూర్, పరకాల, డోర్నకల్, వర్ధన్నపేట, భూపాలపల్లి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, కే.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ తో పాటు తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఉన్నారు.

# మనుగొండలో ఎక్సైజ్ దాడులు నలుగురు అరెస్ట్

- 20 లీటర్ల గుడుంబా స్వాధీనం



**పరకాల, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** గుడుంబా నిర్మూలన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పరకాల ఎక్సయిస్ స్టేషన్ పరిధిలోని గీసుకొండ మండలం లో గల గీసుకొండ, మనుగొండ, ఎలుకుర్తి లలో దాడులు నిర్వహించి మనుగొండ కు చెందిన మదాసి చిన్న ఐలయ్య,గుర్రం దేవి,ఎంబడి మల్లమ్మ,సిద్దె భాగ్యమ్మ లను అరెస్ట్ చేసి వారివద్ద నుండి (20) లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, సిబ్బంది లక్ష్మణ చారి, రవీందర్, సమ్మయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన "గోపు..."

**- కార్పొరేషన్ పదవి ఇవ్వాలని వేడుకోలు.**



**హైదరాబాద్,జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని రాష్ట్రానికి తిరిగి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ కరీంగర్ జిల్లా కార్యాలయ ఇంచార్జ్ గోపు మల్లారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి మల్లారెడ్డి సీఎం ఇంటికి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకోసం పాటుపడుతున్నానని, జిల్లా,రాష్ట్ర పార్టీ ఆదేశాలను పాటిస్తూ పార్టీ పరంగా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నానని గోపు మల్లారెడ్డి ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. పార్టీని నమ్ముకొని పని చేస్తున్న తనకు రాష్ట్రస్థాయిలో నియమించే కార్పొరేషన్ పదవి ఇప్పించాలని మల్లారెడ్డి సీఎంను కోరారు. సీటఎంను కలిసినప్పుడు పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు కూడా ఉన్నారు.

# సిపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన



**బయ్యారం,జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో (ఎం.పి) యు.పి.ఎస్ రంగాపురం పాఠశాలలో భోజన విరామ సమయంలో సిపిఎస్ రద్దు యుపిఎస్ విధానం సరికాదని, ఓపిఎస్ ముద్దు అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వంపై పాఠశాల అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు.కొత్త కొత్త స్కీంల వలన ఎటువంటి లాభం లేదని ఓపిఎస్ స్కీం మాత్రమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని సిపిఎస్ ఉపాధ్యాయులు అందరూ మంగళవారం సిపిఎస్ వ్యతిరేక దినంగా నల్ల బ్యాడ్జిలు,ప్లా కార్డులతో నిరసన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గుగులోత్ రామారావు,నర్సింగారావు,లింగ్య,రాంబాబు,మంగీలాల్,రమేష్,లక్ష్మీనారాయణ,కుమారి, తదితరులు ఉన్నారు.

# లింగమంతుల జాతర ఏర్పాట్ల పరిశీలన



**బయ్యారం, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం మండలం జగ్గు తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామలింగేశ్వర స్వామి(లింగ మంతుల) జాతర సమయానికి బిటి రోడ్డును, విద్యుత్ స్తంబాల నిర్మాణం పూర్తి చేయాలనీ గుడికి సంబంధించిన రహదారిని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. త్వరలో జరగబోయే జాతర సమయానికి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ తో మాట్లాడారు. అలాగే గుడి ప్రాంగణంలో వర్షానికి కూలి పోయిన కరెంటు స్తంభాలను నిర్మాణం చేసి వాటికి లైట్లను అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్,సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,సూరం సుధాకర్ రెడ్డి, వేల్పుల శీను, తమ్మిశెట్టి వెంకటపతి, మంద నాగరాజు, కొండపల్లి లక్ష్మి, బోడ రమేష్,గుంజ వీరస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాచివాని సింగారంలో రోడ్డు ప్రమాదం

**- ట్యూషన్‌కి వెళ్లి వస్తూ పదో తరగతి విద్యార్థి మృతి**

**మేడ్చల్ మల్కాజిగిరి,జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** ట్యూషన్ కి వెళ్లి వస్తూ పదో తరగతి విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కాచి వాని సింగారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేజస్ చౌదరి (14) ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామన్నారు.

# కమలాపూర్ మండలం దేశరాజు పల్లిలో రేవంత్ రెడ్డికి పాలాభిషేకం...



**కమలాపూర్,జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం దేశరాజు పల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి గ్రామంలో లబ్ధిదారులందరికీ రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ అయిన సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు చిత్రపటానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు మహిళలు కృతజ్ఞతలతో పాలాభిషేకం చేయనైనది. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ఒడితల ప్రణవ్ బాబుకి గ్రామస్తులందరూ రుణపడి ఉండాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచిగా ఎంపీటీసీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరనైనది. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, మాజీ ఉపసర్పంచి మిట్టపల్లి సుభాష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సముద్రాల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సముద్రాల ఇస్తారి, సముద్రాల ప్రభాకర్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు సముద్రాల రమేష్ సముద్రాల శ్రీనివాస్ అంబాల సమ్మయ్య సురావ సదయ్య మాజీ వార్డ్ మెంబర్స్ సత్యం వెంకటేష్ భార్గవ్ ఇసంపల్లి శంకర్ ఎల్లబోయిన శ్రీనివాస్ నాగుర్ల రామయ్య కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు మున్నూరు కాపు సంఘం సన్మానం



**గంగాధర, జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్‌లో మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం, పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న గంగాధర ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈరోజు గంగాధర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మధురానగర్ లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిపిన గంగాధర జట్టును శాలువాలతో సన్మానించి అభినందించారు.భవిష్యత్తులో మరింత ఉత్తమంగా రాణించాలని క్రీడాకారులకు సంఘం సభ్యులు సూచించారు.కార్యక్రమంలో చొప్పదండి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మడ్లపల్లి శ్రీనివాస్, సంఘం సభ్యులు సత్తు కనకయ్య, వైద భూపతి, వేముల భాస్కర్, వేముల అంజి, తూము నారాయణ, పేరుక శంకర్, తూము మల్లారెడ్డి, పెంచాల చందు, తూము తిరుపతి,పెరుక.గవాస్కర్, తూము.రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు "దిశ" శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..



**కరీంనగర్,జనవరి28(పిసిడబ్ల్యు న్యూస్):** జిల్లా వ్యాప్తంగా కస్తూరిబా బాలికల విద్యాలయాల్లో వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దిశ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కస్తూరిబా బాలికల పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ పాఠశాలలో దిశ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని కస్తూరిబా పాఠశాలల్లో 7, 8, 9 తరగతుకు చదువుతున్న బాలికలకు దిశ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 46 మంది టీమ్ నెంబర్లు శిక్షణ ఇస్తున్నారని అన్నారు. బాలికలకు జీవితంలో ఉపయోగపడే ఎన్నో అంశాలు ఈ శిక్షణ కార్యక్రమంలో ఉంటాయని తెలిపారు. బాలికల హక్కులు, స్వీయ రక్షణ, ఉన్నత చదువులకు ఎంచుకోవాల్సిన మార్గాలు తదితర అంశాల గురించిన శిక్షణ ఉంటుందన్నారు. ధైర్యంగా సరైన నిర్ణయం తీసుకొని ముందుకు సాగాలని బాలికలకు సూచించారు. పోషకాహారం తీసుకోవాలని, చదువులో మంచి ఫలితాలు సాధించి తోటి బాలికలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, ప్రిన్సిపల్ పుష్పారాణి పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య...

**● నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్,జనవరి28(పిసిడబ్ల్యు న్యూస్):** ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన సోషల్ సైన్స్ ప్రదర్శనశాలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన "ఫెరియో ఫెస్టా" కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో 2700 మంది విద్యార్థినిలు అభ్యసించడం గొప్ప విషయం అన్నారు. వీరంతా విజయం సాధించి వివిధ రంగాల్లో స్థిరపడాలని, తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆర్థికంగా బాగుంటేనే మంచి చదువు చదవగలమని భావనను విడనాడాలని అన్నారు. ప్రభుత్వ రంగంలో అన్ని రకాల సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులో ఉందన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున కళాశాలకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణాన్ని సందర్శించేలా చూడాలని బాలికల అభివృద్ధి అధికారి కృపారాణిని ఆదేశించారు. అనంతరం కళాశాలలో డిపార్ట్మెంట్ వారీగా ఏర్పాటు చేసిన తరగతి గదులను, ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్.సి.సి విద్యార్థులు కలెక్టర్ కు వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రిన్సిపాల్ టీ.భాగ్యలక్ష్మి, ఎన్సిసి డాక్టర్ లెఫ్టినెంట్ ఆయేషా షేక్, అధ్యాపకులు, వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్గీకరణ అమలుకు శాసన ప్రక్రియను వేగవంతం చేయాలి...

**● కవ్వంపల్లి నేతృత్వంలో సీఎం కలిసిన దళిత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**



**హైదరాబాద్,జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎస్సీ వర్గీకరణ అమలుకు అవసరమైన శాసన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన విజయంతంగా ముగించుకొని స్వరాష్టానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవ్వంపల్లి నేతృత్వంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు వేముల వీరేశం ( నకిరేకల్), మందుల సామ్యేల్ (తుంగతుర్తి)లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అమలుపై వారు సీఎంతో చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం వివిధ రాష్ట్రాలు ఆ ప్రక్రియ చేపట్టాయని, అందులో భాగంగానే మన రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ మార్చి 15 తర్వాతే నివేదికను సమర్పించనున్నందున ఎస్సీ వర్గీకరణ అమలుకు అవసరమైన శాసనప్రక్రియను వేగవంతం చేయాలని దళిత ఎమ్మెల్యేలు సీఎంను కోరారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే సానుకూల నిర్ణయంతో సామాజిక న్యాయాన్ని కోరుకునే వారంతా సంతోషపడతారని వారు గుర్తు చేశారు.

# "మానకొండూర్"కు అదనపు ఇండ్లు మంజూరు చేయండి

**● రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటిని కోరిన ఎమ్మెల్యే కవ్వంపల్లి..**



**హైదరాబాద్,జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):**ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మానకొండూర్ నియోజకవర్గానికి ఎక్కువ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా మంగళవారం మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మానకొండూర్ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉందని, సొంత ఇల్లు లేని వారు కూడా అధికంగా ఉన్నారని, ఈ దృష్ట్యా నియోజకవర్గానికి నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఇతర సమస్యలపై కూడా మంత్రి పొంగులేటితో ఆయన చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా మానకొండూర్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి కృషి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి మంత్రికి తెలిపారు.

# చింతల సురేష్, మానస దంపతుల సేవలు అభినందనీయం



**తొర్రూరు ప్రతినిధి,జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ ఆధ్వర్యంలో టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ మానస వారి ఆర్థిక సహకారంతో దంతాలపల్లి మండలంలోని దాట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై,బెల్టు, ఐడి కార్డ్స్ మరియు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ పాషా ప్రసంగిస్తూ ప్రాథమిక పాఠశాలలో బలహీన వర్గాల విద్యార్థులు విద్య అభ్యసిస్తారని, వారికి టీచర్స్ క్లబ్ వారు చేయూత అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు టై బెల్టు, ఐడి కార్డ్స్ ఇంగ్లీష్ సబ్జెక్టుఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ ఉపాధ్యాయురాలు జి. అనిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని దాతలు సహకరించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని, దాట్ల పాఠశాలకు స్వంత ఖర్చుతో చింతల సురేష్ మానస విద్యార్థులకు టై , బెల్టు, ఐడి కార్డ్స్ ఇంగ్లీష్ సబ్జెక్ట్ కి సంబంధించిన మెటీరియల్ మరియు పాఠశాలకు కుర్చీలు పంపిణీ చేయడం, ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చింతల సురేష్ మాట్లాడుతూ టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల కొరత తీర్చేందుకు టీచర్స్ క్లబ్ కృషి చేస్తుందని, విద్యార్థులు దాతలు అందించిన మెటీరియల్ సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాట్ల ఉపాధ్యాయులు రవీందర్, కవిత, అపర్ణ మాట్లాడుతూ టీచర్స్ లయన్స్ క్లబ్ వారు మా పాఠశాలను గుర్తించి మా పాఠశాల పిల్లలకు టై, బెల్టు మెటీరియల్ అందించడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ కార్యదర్శి వేలిదే సురేష్ కుమార్, కోశాధికారి ఎద్దు వెంకన్న, చార్టర్ ప్రెసిడెంట్ సూరం ఉపేందర్ రెడ్డి, క్లబ్ పూర్వ అధ్యక్షులు రాయపల్లి యాకయ్య, క్లబ్ ప్రతినిధులు చింతారామయ్య తోట రమేష్ ఇల్లందుల శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయులు రవీందర్ అనిత అపర్ణ పాష, స్కావెంజర్ ఉమా పాల్గొన్నారు.



# నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పర్యటనను విజయవంతం చేయండి

● ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్



**కరీంనగర్, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు హైదరాబాద్ నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ కరీంనగర్ పట్టణంలో పర్యటించనున్నట్లు ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎంఐఎం ఆఫీస్ దారుసలామ్ లో, కరీంనగర్ పట్టణంతోపాటు, జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూల్లలో ఎస్సేస్సీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉర్దూ మీడియం స్కూళ్లలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు, సాలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేసే ఈ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ను, మోడల్ క్వశ్చన్ పేపర్లను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున తరలిరావాలని, కరీంనగర్ పట్టణంతోపాటు జిల్లాలోని ఎంఐఎం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని భర్తరఫ్ చేయాలి..!



**పరకాల, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజికవేత్త అయిన గద్దర్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ అవమానించడం విచారకరం బాధాకరమని, బండి సంజయ్ ని బర్తరఫ్ చేయాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు. అకారణంగా గద్దర్ పై ప్రేలాపనలు చేసిన బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని, పరకాల ప్రజా యుద్ధ నౌక గద్దర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణ కేంద్రంలో మండల యూత్ అధ్యక్షుడు దొమ్మటి కృష్ణకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బండి సంజయ్ మాటలు గల్లీ లీడర్ కంటే హీనంగా ఉన్నాయని ఎద్దేవ చేశారు. గద్దర్ తన ఆటపాటలతో తెలంగాణ వాదాన్ని, ఉద్యమాన్ని ఉధృతలూగించారన్నారు.తన జీవితం మొత్తం పేద, బడుగు, బలహీన వర్గాల కోసం,తెలంగాణ కోసం త్యాగం చేశారన్నారు. అమరుడిని పట్టుకొని అవమానకరంగా మాట్లాడడం బండి కున్న సంస్కారనికి నిదర్శనం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదని, తెలంగాణ సంస్కృతి, కళలు,గద్దర్ పాటలు, కవితల్లో ప్రతిబింబిస్తాయని గద్దర్ మరణించినప్పుడు ప్రధాని మోడీ పంపిన సంతాప లేఖలో పేర్కొన్నారని గుర్తు చేశారు. బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాధలు గద్దర్ పాటలలో ప్రతిబింబి స్తాయన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, కవితలను పునర్జీవింప జేయడంలో గద్దర్ పాత్ర మరువలేనిదన్నారు. ఆయన కృషి ఎప్పటికీ నిలిచిపోతుందని కొనియాడారు. దేశ ప్రధానని నరేంద్ర మోడీనే గద్దర్ సేవలను కొనియాడితే తెలంగాణలో పుట్టి, తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన సంజయ్ గద్దర్ గురించి మాట్లాడడం దుర్మార్గమని మండిపడ్డారు. తెలంగాణ ను అవమానించిన సంజయ్ కు తెలంగాణలో ఉండే అర్హత లేదన్నారు. తెలంగాణలో ఉండాలంటే ప్రజలకు క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, ఆత్మకూరు మండల యూత్ అధ్యక్షుడు తనగుల సందీప్, దామెర మండల యూత్ అధ్యక్షుడు నల్ల సుధాకర్, పరకాల మండల యూత్ ఉపాధ్యక్షులు సిలువేరు రాఘవ, పోలేపాక ప్రశాంత్,బాగాది రమేష్ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ వారి పెన్షనర్స్ డే, డైరీ ఆవిష్కరణ








**హనుమకొండ, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్ డే, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. సీనియర్ సిటిజెన్స్ నాలెడ్జ్ భవిష్యత్ తరాలకు బంగారు గనులతో సమానమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఒక పుస్తకం చదివితే వందేళ్ల చరిత్ర తెలుస్తోందని, వందేళ్ల జీవితాన్ని చూడాలంటే ఇలాంటి పెద్ద వాళ్ళ అనుభావం, వారు చెప్పే సూచనలు సలహాల ద్వారా నేర్చుకోవచ్చని తెలిపారు. ఇక్కడున్న ప్రతి సీనియర్ సిటిజన్ నా కుటుంబ సభ్యులని మీ అందరిని కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ కి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను ఏక్కడ ఆటంకం కలగకుండా మీ అందరికీ లబ్ధి చేకూరే విధంగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఇప్పటికే వరంగల్ జిల్లాకు వెల్నెస్ సెంటర్ మంజూరు తీసుకురావడం జరిగిందని తెలియజేశారు. దాదాపు 30 ఏళ్లుగా పెండింగ్ లో వరంగల్ జిల్లా సమస్యలను కాంగ్రెస్ పాలనలో ఒక్కొక్కటిగా పరిష్కార దిశగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వరంగల్ జిల్లాను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తూ 6వేల కోట్లు మంజూరు ఇచ్చారని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్ సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడు ముందుంటానని ఎంపీ తెలిపారు. విశ్రాంత కళాశాల అద్యాపకుల సంఘం శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపీ ఫండ్స్ నుండి గేమ్స్ సామాగ్రిని సమకూరుస్తానని వెల్లడించారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి టి ఏ టి వరంగల్ ప్రెసిడెంట్ పులి సారంగపాణి, స్టేట్ ప్రెసిడెంట్ సిహెచ్ విద్యాసాగర్, ఆలిండియా ఫెడరేషన్ రిటైర్డ్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వాణిజ్య పనుల శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆందోళన



**హైదరాబాద్, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం రోజు మధ్యాహ్నం భోజనం సమయములు తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పనుల శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుంది కనుక మాకు రోస్టర్ ప్రకారం ప్రతి ఒక్కరికి న్యాయం చేసి ఉద్యోగుల సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని ఎస్సీ ఎస్టీ వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగ సోదర సోదరీలు వారి సమస్యలపై ఈరోజు వాణిజ్య పనుల శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసిన వారందరికీ పేరుపేరునా అభినందనలు ఈ సమస్యపై కూడా ప్రశ్నించినప్పుడే ఆ సమస్య పరిష్కారం అవ్వడానికి అవకాశం ఉంటుంది కనుక వాణిజ్య పనుల శాఖలో ప్రమోషన్లలో జరుగుతున్న అన్యాయం గురించి ఈరోజు మా యొక్క ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సోదరులు నల్ల రిబ్బన్ తో నిరసన తెలియజేయడంతో ఇప్పటికైనా వాణిజ్య పనుల శాఖలో ఎస్సీ ఎస్టీల ఉద్యోగులకు అన్ని రకాలుగా న్యాయం జరగాలని నా మనస్ఫూర్తిగా కోరుతున్నాము మీ మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం :సెల్ నెంబర్ 98 49 30 44 21

# సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళిందిని స్థలాల పరిశీలన





**మంథని, జనవరి -28 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించడం జరిగిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళిందిని తెలిపారు. మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళిందిని మంథని మండలంలోని ఎక్లాస్పూర్, సిరిపురం, గుంజపడుగు గ్రామాలలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు అనువైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళిందిని మాట్లాడుతూ ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్ష ఏవం ఉత్తన్ మహాభియాన్ స్కీమ్ లో మహిళల ఆర్థిక స్థితి పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రతి జిల్లాకు 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా డిఆర్డిఏ, టిజిరెడ్-కో టిజి ట్రాన్స్కో భాగస్వామ్యం తో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగా ఈరోజు గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మంథని మండలంలోని ఎక్లాస్పూర్, సిరిపురం గుంజపడుగు గ్రామాలలో ప్రభుత్వ భూములు పరిశీలించమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ, రెవెన్యూ , రెడ్ కో, ట్రాన్స్ కో డిఆర్డిఏ సిబ్బంది పాల్గొన్నారు

# మాముసూర్ ఏయిర్ పోర్ట్ పై కలెక్టర్ సమీక్ష



**వరంగల్, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కలెక్టర్ కార్యాలయం లో మమునూర్ ఎయిర్పోర్ట్ పై మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గుంటూరు పల్లె రైతులతో సమీక్ష నిర్వహించడమైనది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిర్పోర్ట్ వలన జిల్లా ఎంతో అభివృద్ధి జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా వరంగల్లు పారిశ్రామిక జిల్లాగా ఎదుగుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా గుంటూరు పల్లె రైతులు మాట్లాడుతూ రోడ్డు కనెక్టివిటీ కావలసిందిగా కోరగా అట్టి విషయంపై ఆర్ అండ్ బి ఈ ఇ జితేందర్ రెడ్డి మరియు రెవెన్యూ అధికారులైన ఖీలా వరంగల్ తహసిల్దార్ నాగేశ్వరావు ను పరిశీలించవలసిందిగా ఆదేశించడమైనది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి ఆర్డీవో సత్యపాల్ రెడ్డి సంబంధిత అధికారులు గుంటూరు పల్లె రైతులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

**చిట్యాల, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య ఉపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతి లు చిట్యాల చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ గారి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా మల్లయ్య తిరుపతి లు మాట్లాడుతు మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ముసాయిదా కమిటీ చైర్మన్ గా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి నేతృత్వంలో భారత రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు రచించి 26 నవంబర్ 1949 లో ఆమోదించి జనవరి 26, 1950న అమలు చేశారని అన్నారు. నాటి నుంచి నేటి వరకు 75 సంవత్సరాలు పూర్తి చేసుకుందని చెప్పారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనను కొనసాగించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్ సాంస్కృతిక కార్యదర్శి జన్నేయుగేందర్ మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డే శంకర్ అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు పుల్ల ప్రతాప్ పాముకుంట్ల చందర్ ఉపాధ్యాయులు చింతల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు



# రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జనవరి- 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం నగర కార్పొరేషన్ పాలకవర్గం కాలపరిమితి జనవరి 26 ,2025 న ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ పెద్దపల్లి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రామగుండం ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ , రామగుండం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ కలెక్టర్‌ను కలిశారు.

# అక్రమంగా మొరంను తరలిస్తున్నారు



**చిట్యాల, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో తహసిల్దార్ గారికి సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్‌బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొన్నం బుచ్చయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల మండలంలోని నవాబుపేట శివారు శాంతినగర్ గుట్టలు రోజురోజుకు అంతరించి పోతున్నాయి అక్రమంగా అధికారులకు తెలవకుండా మట్టినిఇష్టమొచ్చినట్టు తరలిస్తున్నారు అని తహసిల్దార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారురోజురోజుకు సహజ వనరులు అంతరించిపోతే మానవ మునుగడకే ప్రమాదం ఉండే పరిస్థితి ఉంది రాను ఉన్న రోజుల్లో భూకంపాలు వస్తాయి ప్రకృతి సిద్ధమైన వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి నాయకులు



**టేకుమట్ల, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన బిజెపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య తండ్రి బండారి రాజయ్య వారం రోజుల క్రితం మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర బిజెపి నాయకుడు కాసర్ల అరవింద రెడ్డి బిజెపి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రామచంద్రరావు మృతుని ఇంటికి వెళ్లి మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారు మృతికి గల కారణాలు తెలుసుకొని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు మృతుని కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడవద్దని భరోసా కల్పించారు మృతుని కుటుంబానికి బిజెపి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దేశెట్టి సునీల్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు బిజెపి పార్టీ అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు

# రైల్వే స్టేషన్ దగ్గర యాక్సిడెంట్ అయి గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కరీంనగర్ టౌన్, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** గుర్తుతెలియని వ్యక్తి కరీంనగర్ రైల్వే స్టేషన్ దగ్గర యాక్సిడెంట్ అయి చనిపోయినాడు, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ రూమ్ లో ఉన్నది.ఇతని వివరాలు తెలిసిన వారు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఈ నెంబర్ లకు సిఐ 8712670764ఎస్ఐ 9000884443 ఏఎస్ఐ, 8712574476 నంబర్లకు తెలపగలరని రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు.



# ప్రతి ఒక్కరి అభిప్రాయాలను నమోదు చేసుకున్నాం

**● స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ**

**● ప్రజాభిప్రాయ సేకరణకు 3 వేలకు పైగా ప్రజలు హాజరు**

**● ఎన్టిపిసి రెండవ ఫేస్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణంపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**







**ఎన్టిపిసి, జనవరి-28 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్టిపిసి విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పై ప్రజలు అందించిన అభిప్రాయాలను స్వీకరించామని ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని నమోదు చేసి సంబంధిత శాఖకు పంపుతామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎన్టిపిసి జ్యోతి నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్టిపిసి రెండవ ఫేస్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పై నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ లతో కలిసి పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్ని సంఘాల ప్రతినిధులకు, వివిధ వర్గాల ప్రజలకు ఎన్టిపిసి విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పై అభిప్రాయాలు తెలిపే అవకాశం కల్గింది. సుమారు 49బీమందికి పైగా తెలిపిన అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ ఓపికగా నమోదు చేసుకున్నారు. ఉదయం 11 గం. నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంత వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా ఎన్టీపీసీ ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా 1600 మెగా వాట్ల సంబంధించి విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేసుకొని సరఫరా చేయడం జరుగుతుందని, ప్రస్తుతం రెండవ దశలో మిగిలిన 2400 మెగావాట్ల (800 మెగావాట్ల ఐ3 యూనిట్ల) ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ తీసుకున్నామని అన్నారు. ఎన్టిపిసి రెండవ ఫేస్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ప్లాంట్ గా మన రామగుండం ఆవిర్భవిస్తుందని అన్నారు. ఎన్టిపిసి రెండవ ఫేస్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం వల్ల జరిగే పర్యావరణ మార్పుల పై స్టడీ చేసి నివేదిక తయారు చేసారని అన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి వచ్చిన సందేహాలు, సూచనలు అన్ని పరిగణలోకి తీసుకొవడం జరుగుతుందని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ వీడియో రికార్డింగ్ జరుగుతుందని అన్నారు. ప్రజల అందించిన అభిప్రాయాల ఆధారంగా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ఉంటుందని అన్నారు.విద్యుత్ ప్లాంట్ నిర్మాణం వల్ల వచ్చే సామాజిక ఆర్థిక పర్యావరణ మార్పులు, ఎన్టిపిసి చేపట్టే చర్యలు , ప్రాజెక్టు వివరాలను అధికారులు ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించారు. విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు వల్ల సమీప గ్రామాలలో ఎన్టిపిసి సంస్థ సిఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సైతం వచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్టిపిసి రెండవ ఫేస్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని సంబంధించి అన్ని వర్గాల ప్రజలు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజనల్ అధికారి బిక్షపతి, రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, సెంట్రల్ ఎన్.బి.సి సభ్యులు బాబర్ సలీం పాషా, తెలంగాణ ప్రాజెక్టు హెడ్ చందన్ కుమార్ సమంత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యా సంస్థల ప్రతినిధులు పర్యావరణవేత్తలు సామాజిక వర్కర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సమీప గ్రామాలలోని ప్రజలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు



**హనుమకొండ, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని సీఎం గారి నివాసం నందు నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని విదేశీ పర్యటన ముగించుకొని భారీ పెట్టుబడులతో హైదరాబాద్ విచ్చేసిన శుభ సందర్భంగా ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రనాయక్, సహచర శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, హనుమండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి, టి-పిసిసి ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య తో కలిసి ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు.

## సాహితీ వేదిక ప్రధాన సభ్యురాలు డా. చిందం సునీతకు జీవిత సాఫల్య పురస్కారం



**జగిత్యాల, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కరీంనగర్ కళాభారతిలో సంగీత విభావరి కార్యక్రమంలో సాహిత్య, కళా రంగము ప్రత్యేక స్థానం సాధించిన వారికి పురస్కారాలు కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధినేత జి. కృపాదానం ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. సాహిత్య, కళా రంగములో విశిష్ట సేవలకు గుర్తించి జగిత్యాల కు చెందిన కళాశ్రీ సాహితీ వేదిక ప్రధాన సభ్యురాలు డాక్టర్ చిందం సునీతకు పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెకు జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిందం సునీత మాట్లాడుతూ ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. సాహిత్య కళా రంగంలో తాను విశిష్ట సేవలు గుర్తించి పురస్కారం అందించినందుకు కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ప్రవీణ్ సెల్వజి, వెంకటస్వామి గాయకులు ముఫిథిన్, గాయకురాలు సంధ్య, వంగల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేటలో నూతన బస్టాండ్ ఏర్పాటుకు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**● విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లలో కీలకమైన జంక్షన్ కాజీపేట ● ఏడాదిలోపు కాజీపేట నూతన బస్టాండ్ ఏర్పాటు ● వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎంపీ డా. కడియం కావ్య**









**హనుమకొండ, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాజీపేట ఆవరణలో నూతన బస్ స్టాండ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ సికింద్రాబాద్ ఎం గోపాల్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ ప్రంజల్ కేశర్వాణి బృందంతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య స్థలాన్ని పరిశీలించారు. ముందుగా అధికారులతో కలిసి మ్యాప్ ద్వారా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఎన్నో సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పాలనలో పరిష్కరించుకుంటూ వస్తున్నామని తెలియజేశారు. కాజీపేట నూతన బస్టాండ్ ఏర్పాటు కోసం ఈరోజు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించామని వెల్లడించారు. ఏడాదిలోపు కాజీపేట నూతన బస్టాండును ప్రారంభించ కపోతున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కాజీపేట బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లలో కీలకమైన జంక్షన్ కాజీపేట అని పేర్కొన్నారు. బస్టాండు ఏర్పాటుతో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. పార్లమెంట్ లో కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టాలి



**జగిత్యాల,28 (పిసిడబ్ల్యూ న్యూస్):** కలెక్టర్ వసతిగృహాలు రెసిడెన్షియల్ గృహాలలో మరమ్మతుల కోసం కేటాయించిన నిధులను ఏ మేరకు వినియోగంలో తెచ్చారు అనేది శాఖల వారీగా ఇంజనీర్స్ అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మైనార్టీ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, డీఎస్సీడీవో కే రాజకుమార్, డిబిసిడి సునీత, బీఎండబ్ల్యూ చిత్రు పాల్గొన్నారు.

## గద్దర్ గారి పోరాటం ముందు పద్మశ్రీ అవార్డు చాలా చిన్నది

**● బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకో**

**● మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ డిమాండ్**



**టేకుమట్ల, జనవరి 28(పిసిడబ్ల్యూ న్యూస్):** పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప పోరాట యోధుడు గద్దర్..కనీస జ్ఞానం లేని నీలాంటి అజ్ఞానికి ఓటు వేయడం కరీంనగర్ ప్రజల దౌర్భాగ్యంతెలంగాణ ఉద్యమంలో తన మాట పాట ఆటతో యావత్ తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేసిన యుద్ధనౌక గద్దర్ అని కోటగిరి సతీష్ గౌడ్ అన్నారు.ప్రజా యుద్ధనౌక గద్దర్ పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలి. లేకుంటే తెలంగాణ సమాజం మిమ్మల్ని క్షమించదు.బండి సంజయ్ తాను కేంద్రం మంత్రిని అనే విచక్షణ మరిచి గల్లి స్థాయి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు.తెలంగాణ భావజాలం,తెలంగాణ అస్తిత్వం,పేదల పక్షాన పోరాడిన పోరాటయోధుల పై బిజెపికి ఎంత ద్వేషముందో మీ మాటలను బట్టి అర్థమవుతుంది.నీ వ్యాఖ్యలను బట్టి చూస్తే భవిష్యత్తులో ఈ దేశంలో ఆర్ఎస్ఎస్,బిజెపి భావజాలం ఉన్నవారికే ఏ ప్రతిభ పురస్కారాలు అయినా ఇస్తాం... ఎలాంటి అవినీతికి పాల్పడినా వాషింగ్ పౌడర్ నిర్మా సర్టిఫికెట్ ఇస్తాం అనే లాగా ఉన్నాయి.కనీస జ్ఞానం లేని నీలాంటి అజ్ఞానికి కరీంనగర్ బిడ్డలు ఓటు వేయడం, దరిద్రం కొద్దీ నీకు మంత్రి పదవి ఇవ్వడం తెలంగాణ ప్రజల కర్మ.గద్దర్ గురించి మాట్లాడే స్థాయి అర్హత లేని బండి సంజయ్.. బేషరతుగా గద్దర్ , తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ డిమాండ్ చేశారు.

## లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల పట్టణానికి చెందిన 202 లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాది ముభారక్ పథకం ద్వారా మంజూరైన 2 కోట్ల 2 లక్షల రూపాయల విలువగల చెక్కులను, 59 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 19 లక్షల రూపాయల విలువగల చెక్కులను పొన్నాల గార్డెన్స్ లో లబ్ధిదారులకు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అందజేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, 6216 కొత్త రేషన్ కార్డులు జగిత్యాల పట్టణంలో మంజూరు అయ్యాయి.జగిత్యాలకు రాష్ట్రం లోనే అత్యధిక ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయటం కోసం,జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.జగిత్యాల పట్టణంలో ప్రతి వార్డు లో 2 కోట్ల వరకు అభివృద్ధి పనులు కు నిధులు ఖర్చు చేయడం జరిగింది పనులు జరుగుతున్నాయి.మెడికల్ కళాశాల లో గతంలో 10 కోట్ల మాత్రమే మంజూరు కాగా పనులు నిలిచిపోయాయని, ముఖ్యమంత్రి,వైద్య ఆరోగ్య మంత్రి నీ కోరి నిధులు మంజూరుకు కృషి చేసి,మెడికల్ కాలేజి పూర్తికి కృషి చేస్తా అన్నారు. నూకపల్లి అర్బన్ కాలనీ మున్సిపల్ లో కలపబోతున్నం. అంబారీ పెట్ లో 2 కోట్ల తో అర్బన్ పార్క్ ఏర్పాటు తో పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పడుతుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మద్దతుగా ఉండి, బీజేపీ ఎంపీ అరవింద్ తో అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తా..పట్టణం సమగ్ర అభివృద్ధి నా లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రామ్మోహన్,తాజామాజీ మున్సిపల్ చైర్మన్ లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్,బాలే శంకర్,మాజీ కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు, పట్టణ,వార్డు నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న చిలుక్కోయలపాడు యువత

**మహబూబాబాద్, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** సిరోల్ మండలం చిలుక్కోయలపాడు గ్రామంలో స్కూల్ బజార్ కు చెందిన యువత మరోసారి మానవత్వాన్ని చాటుకోవడం జరిగింది.ఇటీవల అనారోగ్య కారణంతో దాసరి ఉప్పులయ్య మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుమారుడు దాసరి ఆదినారాయణ కు తండ్రి దశదినకర్మకు కొంత నగదును గ్రామ మాజీ సర్పంచ్ నాగటి ఉపేంద్ర-ఉప్పలయ్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దాసరి ఆదినారాయణ వారికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలంతా కృతజ్ఞతలు తెలిపారు.



## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన యువజన కాంగ్రెస్ నాయకులు



**రామడుగు, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోనియువజన కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షులు అనుపురం పరశురాం గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ దగ్ధం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ అసెంబ్లీ అధ్యక్షులు యగ్నేష్ఆదేశాల మేరకు హస్తినాపురండివిజన్లోఇందిరాగాంధీపై తెలంగాణ పాటల గొంతుక ప్రజా నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధంచేయడం జరిగింది. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షులు అనుపురం పరశురాం గౌడ్ మాట్లాడుతు మాజీ ప్రధాని ఇంద్ర గాంధీ పై ప్రజా నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా యావత్ తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో బండి సంజయ్ ని తెలంగాణ ప్రజానికం క్షమించదని కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బాధ్యత తో మాట్లాడాలని హితవు పలికారు ఇప్పటికైనా బండి సంజయ్ తన తప్పును తెలుసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి అసెంబ్లీ సీనియర్ నాయకులు మామిడి దిలీప్ కుమార్ మండల సీనియర్ నాయకులు పల్లె రాంరెడ్డి, చొప్పదండి అనిల్,మామిడి రాజశేఖర్,పురెల్ల రాహుల్, సంపత్ రెడ్డి,సిరికొండ సాయి తేజ,రాజేష్,మహిపాల్, విక్రమ్,కిరణ్,అభి మరియు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కథలు బాల బాలికల మనోవికాసానికి దోహదపడతాయి

- డా.అమృతలత జీవన సాఫల్య పురస్కార గ్రహీత దాస్యం సేనాధిపతి



**రామడుగు,జనవరి 28 (పిసిడబ్ల్యూన్యూస్):** కథలు బాల బాలికలలో నైతిక విలువలు పెంపొందించడంతోపాటు వారి మనోవికాసానికిదోహదపడతాయని డాక్టర్ అమృతలత జీవన సాఫల్య పురస్కార గ్రహీత ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి అన్నారు.మంగళవారం రోజున కరీంనగర్ లోని ఆర్విన్ ట్రీ హైస్కూల్లో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో ముఖ్య అతిథిగా హాజరై వైరాగ్యం ప్రభాకర్ ప్రచురించిన బాల కథా కదంబం సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు బాలల్లో చిన్ననాటి నుండి మంచి అలవాట్లను పెంపొందించడానికి ఉపయోగపడతాయని ,బాలబాలికల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. ఉత్తమ పౌరులుగా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవడానికి సహకరిస్తాయని, తోటి వారితో ఎలా ప్రవర్తించాలో, మానవ సంబంధాలనుఎలానిలుపుకోవాలో కథల ద్వారా గ్రహించవచ్చని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త భగవతి మరియు ఆర్విన్ ట్రీ పాఠశాలల చైర్మన్ బి. రమణా రావు మాట్లాడుతూ విద్యార్థులు సమీక్షలు చేయడం ద్వారా ఏది మంచి ఏది చెడు గ్రహిస్తారని, అంతేగాక పుస్తక పఠనం అలవడు తుందని, తద్వారా భాషా నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని, జీవితంలో ఎదురయ్యే సంఘటనలను సమీక్షించుకుని ఉత్తమ జీవితాన్ని పొందగలరని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ బాలసాహితీవేత్త రచయిత గరిపెల్లి అశోక్ మాట్లాడుతూ పిల్లలకుతెలియనివిషయమంటూ ఏదీ లేదని అవకాశం కల్పిస్తే వారు సాధించలేనిదంటూ ఏదీ లేదని అన్నారు. కేవలం మనం చేయాల్సింది వారికి ప్రోత్సాహాన్ని అందించడమేనని అన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ప్రముఖ కవి గంప ఉమాపతి మాట్లాడుతూ నేటి బాలలు చదువులోనే కాదు సంగీతం , సాహిత్యం, చిత్రలేఖనం తదితర రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు.బాల కథా కదంబంలోని ముప్పై కథలను ముప్పై మంది విద్యార్థినీ విద్యార్థులు చక్కని సమీక్షలు చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ద్వారా పిల్లల చేత సాహితీ సభలో సమీక్షలు చేయించి కొత్తదనానికి నాంది పలికిన వైరాగ్యం ప్రభాకర్ ను,చక్కని సమీక్షలు చేసిన విద్యార్థులను పలువురుకవులు అభినందించారు. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాడిశెట్టి గోపాల్ ,అన్నాడి గజేందర్ రెడ్డి, యోగాచార్యసంపత్ ,నగునూరిరాజన్న,జనగాని యుగంధర్ రెడ్డి,సిరిపురం వాణిశ్రీ, కసిరెడ్డి జలంధర్ రెడ్డి ,ఆర్విన్ ట్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బండి సంజయ్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకులు





**హనుమకొండ, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోం సహాయ శాఖా మంత్రి బండి సంజయ్ పద్మ పురస్కారాల విషయంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా.., తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశానుసారం వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్ పిలుపు మేరకు మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్లో బండి సంజయ్ దిష్టి బొమ్మను దగ్ధం చేసిన జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా ఉన్నత స్థాయి పదవిలో ఉండి కేవలం బీజేపీ కి అనుకూలంగా ఉండే వారికి పద్మ పురస్కారాల ఇస్తామనేది సిగ్గుచేటు అని యూత్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. తక్షణమే బండి సంజయ్ గద్దర్ కి తను చేసిన వాక్యాలకు క్షమాపణలు చెప్పాలని మరియు బండి సంజయ్ ను కేంద్రం మంత్రి పదవికి బర్తరఫ్ చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అలువాల కార్తీక్, జిల్లా కాంగ్రెస్ నాయకుల కర్ర హరీష్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్డం వరుణ్, కట్కూరి రేవంత్, సింగారపు తరుణ్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షులు ఆవుల పవన్ కళ్యాణ్, ఉపాధ్యక్షులు బస్కె ప్రణయ్, హసన్ పర్తి మండల అధ్యక్షులు వీర సుధాకర్, హన్మకొండ మండల అధ్యక్షులు డోలి సాగర్, ఐనవోలు మండల అధ్యక్షులు కత్తి సుధీర్, వర్ధన్నపేట అధ్యక్షులు పత్రి భాను ప్రసాద్, కాజీపేట మండల ఉపాధ్యక్షులు కృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు తేజ, జట్టి యుగంధర్, నితిన్, హరిచందర్, దువ్వ రజినీకాంత్, పవన్, పవన్, సాగర్, చరణ్, అభి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజం కోసం విద్యార్థులు సమరశీల పోరాటాలు చేయాలి

- జార్జ్ రెడ్డి మిత్రులు, పిడిఎస్యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రదీప్




**ఖమ్మం, జనవరి 28 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు ఆధ్వర్యంలో పిడిఎస్యు ల విలీన సభ ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండి జడ్పీ సెంటర్ వరకు వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో పిడిఎస్యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జార్జిరెడ్డి మిత్రులు బి. ప్రదీప్ మాట్లాడుతూ పోరాటాల నేపథ్యం ఉన్న ఖమ్మం జిల్లా కేంద్రంగా పిడిఎస్యు లు విలీనం అవ్వడం చారిత్రాత్మకం అన్నారు. పీడీఎస్యు గత 50 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఎంతోమంది విద్యార్థులు ఈ సంస్థ కోసం తమ ప్రాణాలని తృణప్రాయంగా అర్పించారన్నారు. ఈ ఐక్యత బలమైన పోరాటాలు చేయడానికి, పిడిఎస్యు ఆశయాలు లక్ష్యాలైన శాస్త్రీ విద్యా సమజం నూతన ప్రజాస్వామి విప్లవం కోసం పోరాటం చేయడం కోసం తోడ్పాటున అందిస్తుందన్నారు. దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో మోడీ ప్రభుత్వం మతోన్మాద ఫాసిస్టు విధానాలను అవలంబిస్తుందన్నారు. 70% దేశ సంపద ఒక శాతం ఉన్న పెట్టుబడిదారులు అయినా ఆదాని అంబానీ లు దోచుకుంటున్నారన్నారు. వేల కోట్ల రూపాయలను వారికి రుణమాఫీలు ప్రకటిస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారన్నారు. సామాజిక, సంస్కృతిక,ఆర్థిక రంగాల్లో అసమానతలు తారస్థాయికి చేరాయి అన్నారు. అసమానతల సమాజంపై విద్యార్థులు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.దేశంలో ఇప్పటికే నిరుద్యోగం అవిద్య అనారోగ్యం పెరిగిపోతున్నాయన్నారు. దీనికి తోడు మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో పేద ప్రజలకు ఉన్నత విద్యను దూరం చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. యూజీసీ నియమ నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకొని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలను తమ చెప్పు చేతుల్లో పెట్టుకోవడానికి కుట్ర చేస్తుందన్నారు. ఇది యూనివర్సిటీలో స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయటమే అన్నారు. రాష్ట్రంలో రెండు విప్లవ విద్యార్థి సంఘాలు ఐక్యమవడం మంచి పరిణామం అన్నారు. ఈ స్ఫూర్తితో బలమైన పోరాటాలను నిర్మించాలన్నారు. ఐ ఎఫ్ టీయు జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహని కలియుండాలన్నారు. సమిష్టి తత్వాన్ని అరవర్చుకోవాలని సమాజంలో వస్తున్న మార్పులను నిషితంగా గమనించాలన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలకి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి లాంటి విద్యార్థి రత్నాల వారసత్వాన్ని పునికిపుచ్చుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 నెలలుగా అధికారాన్ని కొనసాగిస్తున్నా విద్య రంగాన్ని గాడిలో పెట్టలేదన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం శోషనీయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.టిపిటిఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు టీ. వేణు, పౌర హక్కుల సంఘం నాయకులు పి.విప్లవ కుమార్, టిపిటిఎఫ్ నాయకులు బాబురావు, కట్టా శేఖర్, చిర్రా రవి, పూర్ణ, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బోనగిరి మధు, ఎస్వి శ్రీకాంత్, పోడపంగి నాగరాజు, రాష్ట్ర నాయకులు మస్తాన్, జన్నారపు రాజేశ్వర్, కిరణ్, శ్రీకాంత్, మంద నవీన్, గౌతమ్, తిరుపతి, చరణ్, శ్రీనివాస్, ప్రణయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## అర్చకులకు బకాయి వేతనాలు విడుదల హర్షం...



- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి స్వామి హర్షం...



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** ధూప దీప నైవేద్య అర్చకులకు గత కొన్ని నెలల నుండి వేతనములు లేక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవ శర్మ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుల కృషి మేరకు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్ రావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ సహకారంతో ధూప దీప నైవేద్య అర్చకులకు ప్రభుత్వం బకాయి వేతనాలు విడుదల చేయడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంఘం అధ్య క్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి స్వామి హర్షం వ్యక్తం చేశారు. అర్చకులకు నిధులు విడుదలపై తిరునగరి వెంకటాద్రి స్వామి మాట్లాడు తూ...ధూప దీప నైవేద్య అర్చకు లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సుమారు 6,748 అర్చక కుటుంబాలలో సంతో షాన్ని నింపింది అన్నారు. ఈ పత్రికా సమావేశం కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రాష్ట్ర అధికార ప్రతినిధి తిరుక్కోవల్లూరు శ్రీనివాస మూర్తి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు ఓరుగంటి మాధవా చారి, రాష్ట్ర అధికార ప్రతినిధి వెగ్గళం సంతోష్ శాస్త్రి,రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచార్ల పార్థ సారథి శర్మ,కరీంనగర్ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు సముద్రాల శ్యాంసుందర్ చార్య, ఉపాధ్యక్షులు బస్మాంగి శంకరయ్య,ప్రధాన కార్యదర్శి పటిమెట్ల శివ ప్రసాద్ ,కోశాధికారి దేవరాజు ఆంజనేయ శర్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి అక్కవర మఠం శివప్రసాద్,సిరిసిల్ల జిల్లా గౌరవ అధ్యక్షులు మరింగంటి కొండమాచారి, ప్రధాన కార్యదర్శి పారాంకుశం రమేష్, కోశాధికారి కందలై వెంకట రమణ చార్యులు, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరుట్ల శ్రీధరాచార్యులు, కోశాధికారి సువర్ణ రాజేందర్ శర్మ లు సంయుక్తంగా ప్రభుత్వా నికి, దేవాదాయ శాఖ కమిషర్ కు ప్రభుత్వ సలహాదారు హార్కర్ వేణుగోపాల్ కు రాష్ట్ర, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరవేయాలి...

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, జనవరి 28(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థపై కాషాయ జెండా ఎగురవేసే లక్ష్యంతో బిజెపి కార్పొరేటర్లు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బిజెపి కార్పొరేటర్ల పదవీకాలం ముగుస్తుండడంతో జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ బిజెపి కార్పొరేటర్ లను అనేక ఇబ్బందులు పెట్టిన , పార్టీని నమ్ముకున్న కార్పొరేటర్లు ఇన్నేళ్లుగా ఆయా డివిజన్ ప్రజలతో మమేకమై శక్తి వంచన లేకుండా ప్రజల శ్రేయస్సు , డివిజన్ల అభివృద్ధి కోసం కృషి చేశారని ఈ సందర్భంగా వారందరినీ అభినందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేటర్ల పదవీకాలం ముగిసిన ప్రజలతో తగిన సత్సంబంధాలు కొనసాగించాలని, పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో జరిగిందని, పట్టణ ముఖచిత్రం మార్చడానికి కేంద్ర ప్రభుత్వం వందల కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ చొరవతోనే స్మార్ట్ సిటీ నిధులు వచ్చాయని, కరీంనగర్లో అమృత్ పథకం కింద 24 గంటల మంచినీటి సదుపాయాన్ని ఇటీవలె కేంద్ర మంత్రి కట్టర్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిన డంపింగ్ యార్డ్ సమస్యను కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఇటీవల కరీంనగర్ పర్యటనకు వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కట్టర్ దృష్టికి పబ్లిక్ మీటింగ్ వేదిక గా తీసుకువెళ్లారన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కట్టర్ డంపింగ్ యార్డ్ సమస్య ఖర్చు అంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని సభాముఖంగా తెలియజేశారని , ఇది గొప్ప విషయమన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధి కి బిజెపి కట్టుబడి ఉందని , ఇన్నేళ్లుగా కరీంనగర్లో జరిగిన అభివృద్ధి మోడీ ప్రభుత్వ నిధులతోనేన్న విషయం నగర ప్రజలందరికీ అర్థమైందన్నారు. అందుకే కరీంనగర్ పట్టణ ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని, నగరపాలక సంస్థపై కాషాయం జెండా ఎగరవేయడానికి కార్పొరేటర్లు , పార్టీ శ్రేణులందరూ తగిన కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ ముఖ్యంగా కరీంనగర్ పట్టణం అభివృద్ధి కి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమే నన్నారు. కరీంనగర్కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చి , అందుకు తగిన నిధులను వందల కోట్లల్లో ఇచ్చిందని దీంతో కరీంనగర్ స్వరూపం, ముఖచిత్రం మారిందన్నారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సారథ్యంలో కరీంనగర్ మరింత అభివృద్ధి సాధిస్తుందనే ఆశాభావం ఉందన్నారు. ఇట్టి సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు , పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, దుబ్బాల శ్రీనివాస్ , దండు కొమరయ్య బిజెపి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# స్టార్ హీరోతో పూజాహెగ్డె లిప్‌లాక్



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు ప్రస్తుతం బ్యాడ్ లక్ నడుస్తుంది. ఈ అమ్మడు చేసిన సినిమాలని వరుసగా డిజాస్టర్ గా నిలిచాయి. సినిమాలు ఫ్లాప్ అయ్యాయి కానీ పూజా క్రేజ్ మాత్రం అక్కడా తగ్గలేదు. తెలుగులో తక్కువ సమయంలోనే తోపు హీరోయిన్ గా మారింది ఈ పొడుగుకాళ్ల సుందరి. నాగ చైతన్య ఒక లైలా కోసం సినిమాతో మొదలు పెట్టి చివరిగా వచ్చిన రాదే శ్యామ్ సినిమా వరకు ఈ అమ్మడు తన నటనతో అందంతో కవ్వించింది. కాగా ఈ అమ్మడు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది. అయితే గతకొంతకాలంగా ఈ అమ్మడికి కాలం కలిసి రావడం లేదు. చేసిన సినిమాలన్నీ దారుణంగా నిరాశపరిచాయి. ఒక్క భాషలో కాదు ఆమె నటించిన అన్ని బాషల సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. దాంతో ఈ అమ్మడికి అవకాశాలు తగ్గాయి. ఇప్పుడు యంగ్ బ్యూటీస్ క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్నారు. దాంతో ఇప్పుడు పూజా కూడా స్పీడ్ పెంచాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే తమిళ్ లో ఓ సినిమా హిందీలో ఓ సినిమాను లైనప్ చేసింది. అంతేకాదు ఈసారి డోస్ పెంచి తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేయడానికి రెడీ అవుతుంది. ఇప్పటికే ఈ అమ్మడు తన గ్లామర్ తో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది. కాగా ఇప్పుడు ఓ రొమాంటిక్ సినిమాలో రెచ్చిపోయిందని తెలుస్తుంది. పూజగా తమిళ్ లో దళపతి విజయ్ సరసన ఓ సినిమా చేస్తుంది. అలాగే హిందీలో షాహిద్ కపూర్ తో కలిసి ఓ సినిమా చేస్తుంది. దేవా అనే టైటిల్ తో వస్తున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో పూజా రొమాంటిక్స్ సీన్స్ లో రెచ్చిపోయి నటించిందని తెలుస్తుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమాలో రొమాంటిక్ సీన్స్, బోల్డ్ డైలాగ్స్, అసభ్యకరమైన సన్నివేశాలు ఉండటం పై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో లిప్ లాక్స్ కు కొదవే లేదు అని తెలుస్తుంది. సినిమాలో మొత్తంగా ఆరు లిప్ లాక్స్ ఉంటాయని తెలుస్తుంది. అంతే కాదు షాహిద్ కపూర్–పూజాహెగ్డే మధ్య ఈ లిప్ లాక్ సీన్ ఓ రేంజ్ లో ఉండటంతో ఆ సీన్ ను సెన్సార్ బోర్డు తొలగించాలని సూచిందని తెలుస్తుంది. మొత్తానికి పూజా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించిందట. మరి ఈ సినిమా పూజకు ఎలాంటి హిట్ ఇస్తుందో చూడాలి.



# పాత్ర కోసం ఏదైనా చేస్తావా.?

## - చేదు అనుభవం గురించి నోరువిప్పిన నటి

క్యాస్టింగ్ కౌచ్ పై మరో హీరోయిన్ గళం విప్పింది. దక్షిణాది సినిమా పరిశ్రమలో ఒక డైరెక్టర్ తనను కమిట్మెంట్ అడిగాడంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆమిర్ ఖాన్ బ్లాక్ బస్టర్ మూవీ 'దంగల్'లో అమిర్ కూతురి పాత్రలో నటించిన ఫాతిమా సనా షేక్ ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో తన కాస్టింగ్ కౌచ్ అనుభవం గురించి మాట్లాడింది 'దంగల్' చిత్రంలో నటించి ఓవర్ నైట్ క్రేజ్ తెచ్చుకుంది నటి ఫాతిమా సనా షేక్. అయితే చాలామందికి తెలియని ఈ విషయం ఏమిటంటే ఈ అందాల తార ఒక తెలుగు సినిమాలోనూ నటించింది. ' సౌత్ ఇండియన్ సినిమాల్లో నటిస్తే బాలీవుడ్‌లో మంచి ఆఫర్లు వస్తాయి. అదే కారణంతో కొన్ని సౌత్ ఇండియన్ సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నాను. కానీ అక్కడ నాకు చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్‌లో సినిమా ఆడిషన్ ఉంటుందని, ప్రొఫైల్ పంపమని నా స్నేహితుడు చెప్పాడు. అలాగని నా ఫోటోలు పంపితే.. నాకు ఫోన్ చేసిన వ్యక్తి 'ఈ పాత్ర కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనా?' అని అడిగాడు. అతని ఉద్దేశం నాకు అర్థమైంది. కానీ, అర్థం కానట్టు, 'ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డాను. పాత్రకు కావాల్సినంత పని చేస్తాను' అని అన్నాను. కానీ అతను పదేపదే అడుగుతూనే ఉన్నాడు 'ఏదైనా చేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా'? నేను కూడా అతని ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోలేని విధంగా సమాధానమిస్తున్నాను. కానీ చివరికి అతను చిరాకుపడి ఫోన్ కట్ చేసాడు' అని ఫాతిమా తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. హైదరాబాద్‌లో ఓ నిర్మాతను కలిసిన సమయంలో ' ఇక్కడ నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడుతారు. మీకు తెలుసా.. ఇక్కడ మీరు కొందరిని కలవాల్సి ఉంటుంది అనేవాళ్లు. ఆ విషయం నేరుగా చెప్పేవాళ్లు కాదు. ఎలా చెప్పినా వారి ఉద్దేశమైతే అదే అని తెలిసిపోయేది' అని ఫాతిమా తెలిపింది. దీంతో ప్రస్తుతం ఈ నటి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# తొలిసారి సీనియర్ హీరో మాళవిక



సోషల్ మీడియాలో ఎప్పటికపుడు కొత్త కొత్తగా ట్రెండీ లుక్‌లో మెరిసిపోతూ అభిమానులు, ఫాలోవర్లకు నిద్రపట్టకుండా చేస్తుంది మలబారు సోయగం మాళవిక మోహనన్. ఈ బ్యూటీ ప్రస్తుతం గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్‌తో కలిసి రాజాసాబ్ సినిమాలో నటిస్తుందని తెలిసిందే. తొలిసారి తెలుగులో నటిస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. తాజాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ బ్యూటీ కెరీర్‌లో తొలిసారి ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేసేందుకు రెడీ అయింది. మాళవిక మోహనన్ మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్‌లాల్ హృదయపూర్వంలో హీరోయిన్‌గా ఫైనల్ అయిందని ఇండస్ట్రీ సర్కిల్ సమాచారం. మాళవిక మోహనన్ ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేయడం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని సత్యన్ అంథిక్కడ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో సంగీత, సిద్ధిఖీ, సంగీత్ ప్రతాప్, నిషాన్, లలు అలెక్స్, జనార్ధనన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 10 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది.

# వాడు నా ఫ్రెండ్ : అనిల్ రావిపూడి



టాలీవుడ్‌లో సక్సెస్ ఫుల్ దర్శకుడిగా దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హవా నడుస్తున్న విషయం తెలిసిందే.. కానీ ఈ యంగ్ డైరెక్టర్ మాత్రం ఆ సినిమాల జోలికి పోకుండా తాను నమ్ముకున్న కథతో లోకల్ గానే ఓ రేంజ్ లో హిట్స్ అందుకుంటున్నాడు. ఇక రీసెంట్ గా విక్టరీ వెంకటేష్ తో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు అనిల్. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమా కోసం థియేటర్స్ దగ్గర క్యూ కడుతున్నారు. ఇప్పటికీ ఈ సినిమా హౌస్ ఫుల్ బోర్డ్స్ తో కలలకాలాడుతుంది. ఇక అనిల్ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి దర్శకుడిగా మారిన తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు. పటాస్ సినిమాతో అనిల్ డైరెక్టర్ గా మారాడు. ఈ సినిమా విడుదలై ఇటీవలే 10 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ 10ఏళ్లలో అనిల్ ఫ్లాప్ అంటూ ఎరుగకుండా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. పటాస్, సుప్రీమ్., రాజా ది గ్రేట్,సరిలేరు నీకెవ్వరు, ఎఫ్ 2, ఎఫ్ 3, భగవంత్ కేసరి, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో భారీ హిట్స్ అందుకొని దూసుకుపోతున్నాడు. ఇదిలా ఉంటే అనిల్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కమెడియన్ సప్తగిరి తనకు బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పారు. అంత బెస్ట్ ఫ్రెండ్ కు తన సినిమాలో ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదో కూడా చెప్పారు అనిల్. సప్తగిరి ఫోన్ చేసి తన సినిమాలో ఒక్క సీన్ రెండు సీన్స్ అయితే నేను చేయను అని అంటాడు. సరే రా ఫుల్ లెన్త్ క్యారెక్టర్ నీకు తగ్గది దొరికితే చేద్దాం లే అని నేను అన్నాను. కానీ ఇప్పటి వరకు అది కుదరలేదు. అదే వాడు ఒకటి రెండు సీన్స్ అయినా పర్లేదు అంటే.. వాడికి కోసం ఓ మంచి కామెడీ సీన్స్ చేసేవాడిని అని సరదాగా చెప్పుకొచ్చారు అనిల్. అలాగే సప్తగిరి నేను చాలా క్లోజ్ ఫ్రెండ్స్ అసిస్టెంట్ డైరెక్టర్స్ గా ఉన్నప్పటి నుంచి మేము మంచి ఫ్రెండ్స్ అని అనిల్ తెలిపారు.

# అఖండ-2 నుంచి ప్రగ్యా జైస్వాల్ అవుట్



ఇక మ్యాటర్ ఏంటంటే.. ఈ సినిమా నుంచి ప్రగ్యా జైస్వాల్ తప్పుకుంది. ఆమె స్థానంలోకి సంయుక్త మీనన్ వచ్చింది. ఈ మధ్యే బాలయ్యతో కలిసి ఓ గోల్డ్ యాడ్ చేసింది సంయుక్త. అలాగే ఆయనతో కలిసి ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు కూడా వచ్చింది. బహుశా ఆ పరిచయంతోనే అఖండ 2 హీరోయిన్ రేసులో సంయుక్త ముందుంది. అయితే సంయుక్త రావడం వరకు ఓకే కానీ బాలయ్యతో ఇప్పటికే రెండు సినిమాలు చేసిన ప్రగ్యా జైస్వాల్ ఈ సినిమా నుంచి తప్పుకోవడమే అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇప్పటికే అఖండతో పాటు మొన్నొచ్చిన డాకు మహారాజ్‌లోనూ ప్రగ్యా నటించింది. బాలయ్యతో ఈమెది బ్లాక్‌బస్టర్ జోడీ కూడా. ఇంత రిలేషన్ ఉన్నా ఎందుకు సినిమా నుంచి తప్పుకుంది అనేది అర్థం కాని విషయం చాలా మందికి. అసలు ఈమె తప్పుకుందా లేదంటే తప్పించారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే తనకు తానుగా అఖండ 2 నుంచి ప్రగ్య బయటికి వచ్చిందని తెలుస్తుంది.